
సాక్షి
నారాయణపేట
శనివారం ၊ 23 ၊ మార్చి ၊ 2024





కల్యాణం.. కమనీయం

కందూర్ రామలింగేశ్వర క్షేత్రంలో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.1/15.3

వాతావరణం

నిర్మలంగా ఉంది. కానీ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికమవుతుంది.

ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- 23, 26న పోలింగ్ సిబ్బందికి రెండు దఫాల శిక్షణ
- 27న ఎన్నికల సామగ్రి అందజేత
- జిల్లాలోని 205 మంది ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తాం
- అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించి కలెక్టరేట్‌లో సెక్టార్, జోనల్, రూట్ ఆఫీసర్లు, పీఓ, ఏపీఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ జరుగుతుందన్నారు. 23, 26న రెండు దఫాలుగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి మహబూబ్‌నగర్‌లో శిక్షణ ఉంటుందని, ఆ శిక్షణలో ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేస్తారన్నారు. 27న ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తారని, వాటితో పాటు ఒకే నంబర్ కలిగిన రెండు బ్యాలెట్ బాక్స్‌లను అందజేస్తారన్నారు. నారాయణపేట జిల్లాలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులతో కలిపి 205 మంది ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వారికి గుర్తింపు కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు..

డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకునేటప్పుడు నిశితంగా పరిశీలించి, బ్యాలెట్ పేపర్లను సరిచూసుకొని, పోలీస్ ఎస్కార్ట్ మధ్య పేట ఎంపీడీవో కార్యాలయం పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఒక గదిలో భద్రపరచాలన్నారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో 4 గంటల లోపు ఎంత మంది ఓటర్లు ఉన్న వారు ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రంలో ఇన్ సైడ్, అవుట్ సైడ్ లో రెండు సీసీ కెమెరాలు ఉండేలా సంబంధిత ఏజెన్సీ తో మాట్లాడి వెబ్ కాస్టింగ్ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓ, సెక్టార్, జోనల్, రూట్ అధికారులకు ఐడి కార్డులు ఇవ్వాలన్నారు. ఓటర్లు ఎవరూ కూడా పార్టీ గుర్తులు, కండువాలు, పార్టీ రంగులు కలిగిన చేతిరుమాళ్లతో పోలింగ్ కేంద్రానికి రావడం నిషేదమన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని మహబూబ్‌నగర్‌కు తరలించాలన్నారు. ఆర్డీఓ మధుసూదన్, ఎస్‌డిసి రాజేం దర్‌గౌడ్, జెడ్పీసీఈఓ శైలజ, డిప్యూటీ సీఈవో జ్యోతి, డిఎస్‌పి నల్లపు లింగయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ పరిశీలించారు. ఈనెల 28న జరిగే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకుగాను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ బాక్సులను ఎక్కడ పెట్టాలి, వెయిటింగ్ రూమ్ ఎక్కడ ఉండాలి, పోలీసు బందోబస్తు ఎంత మేర అవసరం అనే అంశాలపై జెడ్పి సీఈవో శైలజ, డిఎస్‌పి నల్లపు లింగయ్యతో చర్చించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. నీటి వసతి, ఎండ తీవ్రతను దృష్టిలోపెట్టుకొని అవసరమైన చోట షామియానాలు వేయించాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాలలో 100 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను అమలు చేయాలని డీఎస్పీకి సూచించారు. ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సిం ఉన్నారు.



జడ్చర్లలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కల నెరవేరిన వేళ..!

జడ్చర్ల బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

- ఉమ్మడి జిల్లాలో ఏ-గ్రేడ్ సాధించిన తొలి కళాశాల
- సంబరాలు జరుపుకొన్న అధ్యాపకులు, విద్యార్థులు

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణారావు (బీఆర్‌ఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరుదైన ఘనత సాధించింది. యూజీసీ కేటాయించే గ్రేడ్‌లలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏ గ్రేడ్ సాధించిన తొలి కళాశాలగా గుర్తింపు పొందింది. అదేవిధగా రాష్ట్రంలో 8వ కళాశాలగా రికార్డు సాధించింది. ఈ మేరకు న్యాక్ నుంచి శుక్రవారం సమాచారం అందింది. కళాశాలకు ఏ గ్రేడ్ దక్కడంతో విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు సంబరాలు జరుపుకొన్నారు.

■ కళాశాలలకు నిధులు కేటాయించేందుకు యూజీసీ ప్రతి ఐదేళ్లకు ఒకమారు న్యాక్ బృందాన్ని పంపించి మౌలిక వసతులు, బోధన, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల పాత్ర వంటి వాటిని అధ్యయనం చేస్తోంది. బీఆర్‌ఆర్ కళాశాలకు ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు న్యాక్ బృందాలు వచ్చాయి. 2005లో తొలిసారి బి-+ గ్రేడ్, 2011 బి-గ్రేడ్, 2017లో బి-++ గ్రేడ్ దక్కింది. 2023, మార్చి 15, 16 తేదీల్లో న్యాక్ బృందం పర్యటించి బి-++ గ్రేడ్ కొనసాగించేలా 2.82 సీజీపీఏ మార్కులు కేటాయించింది. దీంతో పూర్వ విద్యార్థుల సంఘం, ప్రిన్సిపాల్ గ్రేడ్ కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని న్యాక్‌కు అప్పీల్‌కు వెళ్లారు. స్పందించిన న్యాక్ గత నెల 21, 22 తేదీల్లో మరోమారు బృందాన్ని పంపించి పునః పరిశీలన చేయాలని సూచించింది. ఆ బృందం కళాశాలను సందర్శించి 3.24 మార్కులు కేటాయించింది. దీంతో ఏ గ్రేడ్ కేటాయిస్తూ న్యాక్ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి జడ్చర్లలోని డిగ్రీ కళాశాలలో ఉన్న సదుపాయాలు మరే కళాశాలలో లేవనే చెప్పాలి. ముఖ్యంగా బొటానికల్ గార్డెన్, స్టేట్ హెర్బేరియం, బయో డైవర్సిటీ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్, ఐక్యూఏసీ, పూర్వ విద్యార్థుల సంఘం వంటివి అనేకం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కళాశాల అభివృద్ధిలోనూ పూర్వ విద్యార్థుల పాత్రను న్యాక్‌బృందం ప్రశంసించింది.

ఉమ్మడి జిల్లాలో తొలి కళాశాల..

ఉమ్మడి జిల్లాలో 24 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా ఏ-గ్రేడ్ సాధించిన తొలి కళాశాలగా డా. బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఘనత సాధించింది. 60 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన కళాశాల ఏ-గ్రేడ్ సాధించడంతో రూ.10 కోట్లు రానున్నాయి.

అధ్యాపకులు, విద్యార్థుల సంబరాలు..

ఏ-గ్రేడ్ దక్కడంతో విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం కళాశాల ప్రాంగణంలో సంబరాలు జరుపుకొన్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ సతీష్, ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మను సత్కరించి అభినందించారు.

స్వయం ప్రతిపత్తి కళాశాలగా..

ఏ-గ్రేడ్ సాధించడంతో కళాశాలకు స్వయం ప్రతిపత్తి అవకాశాలు కలిగాయి. ఏ యూనివర్సిటీతో సంబంధం లేకుండా పరిపాలన, పరీక్షల నిర్వహణ వంటి వాటన్నింటిని స్వయంగా కళాశాలలోనే నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు దక్కింది. ఏ కోర్సులు ప్రారంభించాలి.. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై పూర్తి నిర్ణయాధికారం అధ్యాపకులదే కావడం గమనార్హం. మినీ యూనివర్సిటీగా కళాశాలను పేర్కొనవచ్చు.

మరింతగా తీర్చిదిద్దుతాం..



ఆరు దశాబ్దాల చరిత్ర కలిగి వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు ఏ-గ్రేడ్ దక్కడం మా కృషికి ఫలితంగా భావిస్తున్నాం. కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడంతో తీర్చిదిద్ది భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తాం. ఇప్పటికైతే మినీ యూనివర్సిటీగా భావిస్తున్నాం. ఏ గ్రేడ్ సాధించేందుకు కారణమైన అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు.
– పి.రామ్మోహన్, అధ్యక్షుడు, పూర్వ విద్యార్థుల సంఘం

ఏ గ్రేడ్ రావడం సంతోషం..



నేను చదివిన కళాశాలకు ఏ గ్రేడ్ సాధించాలనే పట్టుదలతో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టా. రాబోయే రోజుల్లో గ్రామీణప్రాంత విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించబడతాయి. రాష్ట్రంలో ఏ గ్రేడ్ సాధించిన కళాశాలలు 7 ఉండగా.. 8వ కళాశాల మనది కావడం గర్వంగా ఉంది.
– శ్రీనివాసులు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్

అప్పీల్‌తోనే సాధ్యమైంది..



గతేడాది బీ ++ గ్రేడ్ రావడంతో నిరుత్సాహానికి గురై పూర్వ విద్యార్థులతో కలిసి న్యాక్‌కు అప్పీల్ చేశాం. మా వినతి మేరకు గత నెల బృందం పర్యటించడంతో ఏ గ్రేడ్ దక్కింది. ఉమ్మడి జిల్లాలో 24 కళాశాలలు ఉండగా ఏ గ్రేడ్ సాధించిన తొలి కళాశాల మాదే. అలాగే ఇకపై కళాశాలకు స్వయం ప్రతిపత్తి అంటే పరిపాలన, పరీక్షల నిర్వహణ అంతా యూనివర్సిటీతో సంబంధం లేకుండా నిర్వహించే అవకాశం కలిగినట్లయింది.
– డా.అప్పియా చిన్నమ్మ, ప్రిన్సిపాల్

న్యూస్‌రీల్

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



నారాయణపేట: జిల్లా పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని.. ప్రధానంగా అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎక్సైజ్ పోలీసులకు సూచించారు. శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో అక్రమ బెల్ట్ షాపులలో మద్యం విక్రయాలు అరికట్టాలని, సరిహద్దు బార్డర్ చెక్ పోస్టుల వద్ద పోలీసులతోపాటు, ఎక్సైజ్ పోలీసులను నియమించాలని సూచించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అక్రమంగా తరలించే డబ్బు, మద్యం , గంజాయి, బంగారం, ఇతర విలువైన వస్తువులు రవాణా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, గుడుంబా, గంజాయిపై సంయుక్తంగా దాడులు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్, పేట, కోస్గి ఎక్సైజ్ సీఐలు అశోక్ కుమార్, బాలకృష్ణ, ఎస్సైలు రమేష్, గురువయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



నారాయణపేట: జిల్లాలో రంజాన్ మాసం సందర్భంగా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, ఊట్కూర్‌లోని జన సామర్థ్యం గల ప్రదేశాల్లో, ప్రార్థన మందిరాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

మోదీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

మక్తల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు గెలుపొంది మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రానుందని రాష్ట్ర బిజేపి కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. శుక్రవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపి అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆమెకు ఉమ్మడి పాలమూరు జిల్లా సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలియపర్చి ఆమె గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డోకూరు పవన్‌కుమార్, బాల్‌రెడ్డి, సోంశేఖర్‌గౌడ్, బాల్‌రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగప్ప, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కష్టాలు షురూ



రామన్‌పాడులోని ఆత్మకూర్ ఇంటెక్‌వెల్ వద్ద కాల్వలో పూడికతీస్తున్న జేసీబీ (ఫైల్)

జల గోస

- రామన్‌పాడులో తగ్గుతున్న బ్యాక్‌వాటర్ నిల్వలు
- ఈ జలాశయంపై మూడు తాగునీటి పథకాలు
- ఇప్పటికే జూరాల నుంచి నిలిచిన ఎత్తిపోతలు
- ఆత్మకూర్ టన్నెల్ వద్దకు చేరుకోని ఫైనం
- పూడికతీతకు సిద్ధమవుతున్న అధికారులు



రామన్‌పాడు పథకానికి నీటిని అందిస్తున్న టన్నెల్ వద్ద అందని నీరు

అమరచింత: జిల్లాలోని రామన్‌పాడు రిజర్వాయర్‌పై ఆధారపడిన తాగునీటి పథకాలకు నీటి కష్టాలు తప్పేలా లేవు. బ్యాక్‌వాటర్‌లో రోజురోజుకు నిల్వ నీటిమట్టం తగ్గుతుండటంతో ఇంటెక్ వెల్‌లో టన్నెల్‌కు నీటిని మళ్లించే పనులకు మిషన్ భగీరథ అధికారులు శ్రీకారం చుట్టారు. గతేడాది ఏప్రిల్, మే నెలలో తాగునీటి సమస్య రాగా.. ఈసారి మార్చిలోనే తాగునీటి కోసం తహతహలాడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో 1,010 అడుగుల నీటిమట్టం ఉండటంతో ఆత్మకూర్ టన్నెల్‌కు నీరు అందడం లేదు. దీంతో మిషన్ భగీరథ అధికారులు పక్షం రోజుల కిందట జేసీబీతో కాల్వ పూడికతీత పనులు చేపట్టారు. ఈ క్రమంలో బ్యాక్‌వాటర్ తగ్గుతుండటంతో మోటార్లకు నీరు అందక మరోమారు పూడిక తీయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని నిరంతరం అందిస్తుండటంతో గ్రామాల్లో చేతిపంపులు మరుగునపడ్డాయి. దీంతో పల్లెవాసులు కుళాయి నీటిపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా రామన్‌పాడు రిజర్వాయర్‌ను తాగు, సాగునీటి అవసరాల కోసం నిర్మించారు. దీంతో రామన్‌పాడు రిజర్వాయర్‌పై ఆత్మకూర్, అచ్చంపేట, ఎర్రగట్టు తాగునీటి పథకాలు ఏర్పాటు చేసి నిత్యం నీటిని ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆత్మకూర్ తాగునీటి పథకం ద్వారా 12 గ్రామాలకు, అచ్చంపేట స్కీం ద్వారా 120 గ్రామాలకు, ఎర్రగట్టు ఎత్తిపోతల పథకం ద్వారా 38 గ్రామాలకు తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నారు. మొత్తంగా నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 170 గ్రామాలకు తాగునీటిని అందించే రామన్‌పాడు రిజర్వాయర్ ప్రస్తుతం నిల్వ నీటిమట్టం తగ్గుతుండటంతో బోసిపోతున్నట్లుగా కనిపిస్తోంది.

ఇంటెక్‌వెల్ వద్ద పూడికతీత..

రామన్‌పాడు ప్రాజెక్టు వద్ద ఉన్న ఆత్మకూర్ తాగునీటి పథకం ఇంటెక్‌వెల్ వద్ద ఉన్న పైపులకు రిజర్వాయర్‌లోని నీరు అందడం లేదని భావించిన అధికారులు జేసీబీలతో కాల్వలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులకు పక్షం రోజుల కిందట చేపట్టారు. 30 అడుగుల మేరకు పూడిక తీయడంతో ఇంటెక్ వెల్ పైపులకు తాగునీరు అందడం ద్వారా ఆత్మకూర్ వాటర్ స్కీంకు నీటి సమస్య తీరింది. దీనికితోడు జూరాల నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని వదులుతుండటంతో ముందస్తుగా కాల్వలోని చెత్తాచెదారం తొలగించి నీటిని రామన్‌పాడు రిజర్వాయర్‌లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎర్రగట్టు, అచ్చంపేట తాగునీటి పథకాల పైపులు రామన్‌పాడు జలాశయం మధ్యలో ఉండటంతో వాటికి ప్రస్తుతం నీటి ఇబ్బందులు లేవని.. కేవలం ఆత్మకూర్ తాగునీటి స్కీంకు మాత్రం టన్నెల్‌కు నీరు అందలేకపోతుంది.

పూడికతీత చేపడుతున్నాం..



రామన్‌పాడు రిజర్వాయర్ కింద చాలామంది రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం జూరాలలో నీటిమట్టం పూర్తిగా తగ్గుతుంది. దీంతో రామన్‌పాడుకు నీటి సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం 1,010 అడుగుల మేర నీటి మట్టం ఉంది. ఆత్మకూర్ టన్నెల్‌కు నీరు అందడం లేదని కాల్వ పూడికతీత పనులు చేపడుతున్నాం. పక్షం రోజుల్లో పంటలు చేతికొస్తాయి.. దీంతో సాగునీటి వాడకం తగ్గుతుండటంతో వేసవిలో తాగునీటి పథకాలకు నీటిని పూర్తిస్థాయిలో అందించే అవకాశం ఉంది.
– రామకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ, అమరచింత



జూరాల ఎడమ కాల్వ పరిస్థితి ఇలా..

సమన్వయంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న చించోలీ డీఎస్పీ సంగమంత్ హిరేమత్

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఇరు రాష్ట్రాల సరిహద్దు వద్ద పోలీసులు సమన్వయంతో ముందుకెళ్లాలని చించోలి డీఎస్పీ సంగమంత్ హిరేమత్ సూచించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం కర్ణాటకలోని కలిబుర్గి (గుల్బార్గా) జిల్లాలోని సేడం సర్కిల్ ఆఫీస్‌లో బార్డర్ పోలీసులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సరిహద్దు వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టేలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అక్రమంగా డబ్బు, మద్యం, గంజాయి, బంగారం ఇతర విలువైన వస్తువులు రవాణా జరగకుండా సమన్వయంతో పనిచేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ స్టేషన్లలో క్రైమ్ పూర్తి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ అశోక్, సీఐ శివశంకర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలి

నారాయణపేట: వేసవిలో ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. మండలాల్లో ఉపాధి హామీ పనులపై ప్రణాళికలను రూపొందించాలని, కూలీలకు తాగునీటి వసతి ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి పనులపై ప్రణాళిక సిద్ధం చేసి అందజేస్తామని అధికారులు అడిషనల్ కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ రాజేశ్వరి, ఎంపీడీఓలు, ఎంపీవోలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అలసందలు క్వింటా రూ.7,469

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం అలసందలు క్వింటా గరి ష్టంగా రూ.7,469, కనిష్టంగా రూ.7,269 ధర పలికింది. అలాగే, జొన్నలు గరిష్టంగా 4,751, కనిష్టంగా రూ.2,511, పెసర గరిష్టంగా రూ.8,689, కనిష్టంగా రూ.8,429, వేరుశనగ గరిష్టంగా రూ.5,469, కనిష్టంగా రూ.5,209 ధర పలికాయి.

వ్యూహాలకు కసరత్తు

- నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు పూర్తి
- ప్రచారానికి సిద్ధమవుతున్న పార్టీలు



సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల ప్రధాన పార్టీల లోక్‌సభ అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. విజయం కోసం ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ఎంపీ అభ్యర్థులు ఎవరో తేలడంతో ఉత్కంఠకు తెరపడింది. స్థానికంగా సమీకరణాలు శరవేగంగా మారుతున్న తరుణంలో రాజకీయ వేడి మొదలైంది. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కొంత మంది నాయకులతో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. వంద రోజుల్లో తాము అమలు చేసిన పతకాలు ఓటర్లకు వివరించాలని భావిస్తోంది. బీఆర్‌ఎస్ మాత్రం వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఓటర్ల ముందు ఎండగట్టాలని నిర్ణయించింది. బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాలపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఇప్పటికే ప్రధాని మోదీ పర్యటన పూర్తి కాగా ఇతర నేతలను రప్పించి ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని భావిస్తోంది.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రొఫైల్



పేరు: రేపల్లే శివ ప్రవీణ్‌కుమార్

తల్లిదండ్రులు: ప్రేమలత, సవారన్న

పుట్టిన తేదీ: 23-11-1967

స్వస్థలం: అలంపూర్

విద్యార్హతలు: ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) హార్వర్డ్ యూనివర్సిటీ, యూఎస్‌ఏ

వృత్తి: ఐపీఎస్ అధికారి(1995 బ్యాచ్, గతేడాది ఉద్యోగానికి రాజీనామా) గురుకుల కార్యదర్శితో పాటు ప్రభుత్వశాఖలో వివిధ హోదాలో పనిచేశారు. స్వేరోస్ సంస్థ స్థాపించి పలు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టారు.

రాజకీయ అనుభవం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ గత శాసనసభ ఎన్నికల్లో సిర్పూర్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు.

క్లుప్తంగా

స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి


దాక్షాయిని (ఫైల్)

కోయిల్‌కొండ: స్కూల్ బస్సు ఢీ కొని చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మోదీపూర్ చెందిన అమృతమ్మ, బోయిని మొగులయ్య దంపతుల రెండవ కూతురు దాక్షాయిని(4) గ్రామంలో రోడ్డు పై వెళ్తుండగా, శేరివెంకటాపూర్ నుంచి పారుపల్లి వైపుగా అతివేగంగా వెళ్తున్న ప్రైవేట్‌పాఠశాల బస్సు చిన్నారిని ఢీకొంది. ముందలిటైరు చిన్నారిపై వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: మహిళ మృతి


అనసూయమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో మహిళ మృతిచెందిన సంఘటన మున్సిపాల్టీ పరిధిలోని నాగనూలులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దపూర్‌కి చెందిన ఆశావర్కర్ అనసూయమ్మ(45) పని నిమిత్తం జిల్లా కేంద్రానికి అదే గ్రామానికి చెందిన మల్లేష్‌కు చెందిన ఆటోలో వెళ్తుంది. మున్సిపాల్టీ పరిధిలోని నాగనూలులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న అనసూయమ్మకు తీవ్రగాయాలు అవడంతో చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చింతకాయలు తెంపేందుకు వెళ్లి..

బాలానగర్: చెట్టుపై నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగధారిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ర్యాకల చెన్నయ్య (50) చింతపండు తెంపేందుకు చింతచెట్టు పైకి ఎక్కగా కాలుజారి కిందపడ్డాడు. ఆయనకు తీవ్ర గాయాలు కాగా షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్‌ఐ తిరుపాజీ పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వెల్దండ: మండలంలోని గుండాల సమీపంలో ఈనెల 16వ తేదీన స్కూటి అదుపుతప్పి ఇస్లావత్ సంగడా(47)తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాదులో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. హైదరాబాదుకు చెందిన సంగడా, అతని కుమారుడు గవాస్‌లు చారకొండ మండలం సారబండతండాలో వివాహానికి హాజరై తిరుగు ప్రయాణం అయ్యారు. గుండాల సమీపంలో స్కూటి అదుపుతప్పి కింద పడ్డారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం హైదరాబాదులోని ఉస్మానియా తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెల కాపరులపై దాడి

- 20 గొర్రెల అపహరణ

కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో గురువారం అర్ధరాత్రి గొర్రెల కాపరులపై దాడి చేసి 20 గొర్రెలను అపహరించారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి రోజు మాదిరిగానే చేగుంట మాళప్ప, బొంబాయి నాగప్ప తమ గొర్రెలను మేపుకొని సాయంత్రం ఆలంపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో గొర్రెల మందను నిలిపారు. కాగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక మ్యాక్సి పికప్‌లో ఏడుగురు తమ వద్దకు వచ్చి, దాడి చేసి 20 గొర్రెలను అందులో వేసుకుని వెళ్లారు. అడ్డుకోడానికి వెళ్తే చంపుతామని బెదిరించడంతో, భయంతో ఉండిపోయామని చెప్పారు. దొంగలు వెళ్లిన తరువాత గ్రామస్తులకు తెలియజేయడంతో వారు కొంత వరకు వెతికినా వారి ఆచూకీ లభించలేదని చెప్పారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


శివకుమార్

జడ్చర్ల: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు గోల్‌కీపర్ శివకుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు గోల్‌కీపర్‌గా వ్యవహరించాడు. కోడ్గల్‌కు చెందిన శివకుమార్ తన ప్రతిభను కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 23 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం విదిశలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలుర విభాగంలో గోల్‌కీపర్‌గా వ్యవహరిస్తారని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ తెలియజేశారు.

శరవేగంగా ఎన్‌హెచ్ పనులు

- పూర్తవుతున్న సర్వీసు రోడ్లు
- మారుతున్న రూపురేఖలు, తీరనున్న ఇక్కట్లు


గొల్లగడ్డ సమీపంలో పూర్తయిన రోడ్డు

గండేడ్: ఒకప్పుడు అది సింగిల్ రోడ్డు.. బీటీ రోడ్డు పక్కన మోకాలిలోతు గుంతలు. రోడ్డు దిగాలంటే ద్విచక్ర వాహనదారులు పడరాని పాట్లు పడాల్సిందే. ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇవ్వాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. లెక్కలేనన్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్–చించోలి రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించింది. దీంతో ఈ రోడ్డుకు మహర్దశ పట్టుకుంది. బెంగుళూరు–ముంబాయిల మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరించనున్నారు. రాష్ట్రంలో మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈ రోడ్డును 167 జాతీయ రహదారిగా గుర్తించారు. పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజి భూత్పూర్ నుంచి దుద్యాల వరకు కాగా, రెండోది దుద్యాల నుంచి మన్నెకలి వరకు.

ఏడాది నుంచి పురోగతి..

జాతీయ రహదారి పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఎక్కడా జాప్యం కావడం లేదు. పనులు గతేడాది మార్చిలో ప్రారంభమై నేటికి ఏడాది కావస్తున్నది. విస్తరణ పనులు రెండేళ్లలో పూర్తి చేయాలి. ఏడాదిలో 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఇరువైపుల విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దుద్యాల్ గేటు నుంచి మహమ్మదాబాద్ వరకు దాదాపుగా బీటీ పనులు పూర్తి చేశారు. కొన్ని చోట్ల డబుల్ లేయర్ బీటీ వేయడం పూర్తయ్యింది.

డ్రైయిన్ల నిర్మాణం

జిల్లా పరిధిలోని గండేడ్ మండలంలో జానంపల్లి, రంగారెడ్డిపల్లి, మహమ్మదాబాద్, సల్కర్‌పేట్, నంచర్ల గేటు, కొంరెడ్డిపల్లి, గండేడ్, హన్వాడా, భూత్పూర్, మహబూబ్‌నగర్ అర్బన్ మండలాల్లోని ఆయా గ్రామాల వద్ద 10 మీటర్లు రోడ్డు వదిలి ఇరు వైపులా వర్షపు నీరు పోవడానికి డ్రైయిన్లు నిర్మిస్తున్నారు. ఇది వరకే వీటి నిర్మాణం పూర్తి కావచ్చింది. డ్రైయిన్‌కు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మిస్తున్నారు. అయితే అన్ని గ్రామాల వద్ద డ్రైయిన్ 10 మీటర్ల తర్వాత నిర్మిస్తుండగా కోస్గిలో మాత్రం రోడ్డు చివరన నిర్మించారు. వీటి నిర్మాణంతో వర్షపు నీరు సులభంగా వెళ్లి పోవడమే కాక రోడ్డు దెబ్బతినకుండా ఉంటుంది.

ప్రారంభమైన బ్రిడ్జి పనులు


రంగారెడ్డిపల్లి వద్ద ప్రారంభమైన బ్రిడ్జి పనులు

రోడ్డు విస్తరణలో భాగంగా మలుపులు సరిచేస్తున్నారు. ప్రమాదాల నివారణ నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రమాదకర మలుపులు ఉన్నాయో వాటిని వీలైనంత మేర సరి చేస్తున్నారు. ఇందులో భాగంగా సల్కర్‌పేట్–రంగారెడ్డిపల్లి మధ్య రోడ్డును రీ అలైన్‌మెంట్ చేశారు. ఇందుకు గతంలోనే అధికారులు భూ సేకరణ పూర్తి చేశారు. 4.5 ఎకరాల భూమి అవసరమని అప్పట్లో గుర్తించారు. దీని ద్వారా ప్రమాదకరంగా ఉన్న మలుపును సరిచేయాలని అధికారులు సంకల్పించారు. ప్రస్తుతం పెద్దవాగుపై రంగారెడ్డిపల్లి వద్ద బ్రిడ్జి పనులు ప్రారంభించారు. మొన్నటి వరకు నీళ్లు ఉండడంతో పనుల నిర్వాహణకు ఆటంకంగా మారింది. ప్రస్తుతం ఎండిపోవడంతో పనులు ప్రారంభించారు. వర్షాకాలం రాకముందే దీనిని పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. భూత్పూర్ నుంచి దుద్యాల వరకు ఇదే పెద్ద బ్రిడ్జి. ఇది పూర్తయ్యి రాకపోకలు దీని గుండా కొనసాగితే ప్రమాదాలకు ఆస్కారం లేదు. గతంలో రంగారెడ్డిపల్లి మలుపు వద్ద చాలా ప్రమాదాలు జరిగాయి. దీంతో పాటు సల్కర్‌పేట్, గండేడ్, కొంరెడ్డిపల్లి, మొకర్లాబాద్, మహమ్మదాబాద్, ఇబ్రహీంబాద్ గ్రామాల వద్ద ఇప్పటికే అవసరమున్న బ్రిడ్జిల నిర్మాణం పూర్తి కావచ్చింది.

గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు

ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలగకుండా గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు వేస్తున్నారు. ఇప్పటికే సంపల్లి, జానంపల్లి, రంగారెడ్డిపల్లి, గండేడ్, కొంరెడ్డిపల్లి గ్రామాల వద్ద సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. దీంతో ఎలాంటి అంతరాయం కలగకుండా వారి గ్రామాలకు సులువుగా వెళ్తున్నారు. ఇరువైపులా 5.5 మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మించగా హన్వాడా, నంచర్ల వద్ద మాత్రం 7.5 మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు.


జానంపల్లి వద్ద బారికేడ్ల ఏర్పాటు

మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ..

గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే రవాణా వ్యవస్థే ప్రధాన కారణం. ప్రస్తుతం రెండువరుసల రహదారిగా విస్తరించబడడంతో ఈ ప్రాంత గ్రామాల అభివృద్ధికి ఆస్కారం ఉంది. తాండూరులో నాపరాతి గనులు ఉండడంతో కరణ్‌కోట్‌లో సీసీఐ, పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు పక్కనే గల కర్ణాటకలోని సేడెం, మల్కేడ్ తదితర ప్రాంతాల్లో సిమెంటు ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని బెంగుళూరు, హైదరాబాద్, ముంబాయి తదితర ప్రాంతాలకు తరలిస్తారు. ఇందుకుగాను మహబూబ్‌నగర్–చించోళి రహదారి అనుకూలం. వేల సంఖ్యలో వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తాయి. అంతేకాక ఈ రహదారి మీదుగా వెళ్తే బెంగుళూరు–ముంబాయిల మధ్య దూరం దాదాపు 150 కిలోమీటర్లు తగ్గడమే కాక సమయం కూడ ఆదా అవనుంది.

ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ సైనికుల ఎంపికపై అవగాహన




సదస్సులో మాట్లాడతున్న వింగ్ కమాండర్ అనుప్రీతి

నాగర్‌కర్నూల్: యువత దేశానికి తరగని సంపద, ఆ యువత దేశ రక్షణలో ఉండి కాపాడేందుకు ముందుకు రావాలని, త్రివిధ దళాల ఒకటైన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీరులు సైనికుల ఎంపికలో పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఎయిర్‌ఫోర్స్, అగ్నివీర్ ఎంపికపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వింగ్ కమాండర్ అనుప్రీతి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీరులు సైనికులు 3 రౌండ్‌లో ఆన్‌లైన్ పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లో పాల్గొని ఎన్‌సీసీ–సీ సర్టిఫికెట్ ఉంటే ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా దేశ రక్షణకు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షాజహానాసుల్తానా, కమాండర్ సందీప్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని అస్త్రం.. ఓటు

- పారదర్శకంగా వినియోగిస్తే బంగారు భవిత
- నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్న ఓటరు నమోదు
- 18 ఏళ్లు నిండిన వారందరూ నమోదు చేసుకోవాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. రాజ్యాంగం ప్రజల చేతిలో పెట్టిన వజ్రాయుధం.. సరైన ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు తిరుగులేని అస్త్రం ఓటు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈసీ సూచిస్తోంది. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

పారదర్శకంగా వినియోగించుకుంటేనే..

ప్రజాస్వామ్యాన్ని సక్రమ దారిలో నడిపేందుకు ఓటు దోహదపడుతుంది. పారదర్శకంగా వినియోగించుకుంటే బంగారు భవితకు బాటలు వేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల కమిషన్ వివిధ దశల్లో ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తోంది. గతనెల వరకు ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించారు. తుది ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా జనవరి 6న ముసాయిదా జాబితా, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. కొత్త ఓటరు నమోదుతో సహా.. మార్పులు, చేర్పులు, సవరణలకు దరఖాస్తు ప్రక్రియను ఎన్నికల సంఘం నిరంతరం కొనసాగిస్తూ.. ప్రత్యేక శిబిరాల ద్వారా ఓటరు నమోదు ఆవశ్యకతను చాటుతోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌ఓ, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో https://nvsp.in, https://ceotelangana.nic.in, https:// voters.eci.gov.in లోగానీ లేదా ఫోన్‌లో voter help app వెబ్‌సైట్ ద్వారా ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ..

ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం సాగుతుంది. ఆన్‌లైన్‌లో గాని, ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. అర్హులందరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి.

– జి.రవినాయక్, కలెక్టర్

మహిళా ఓటర్లే అధికం..

గతనెల ఫిబ్రవరి 8న ప్రకటించిన ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలోని మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 16,80,417 మంది ఓటర్లు ఉండగా.. 8,48,293 మంది మహిళలు, 8,32,080 మంది పురుషులు, 44 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కొడంగల్	1,19,237	1,23,020	10	2,42,267
నారాయణపేట	1,16,261	1,19,254	2	2,35,517
మహబూబ్‌నగర్	1,28,268	1,30,377	13	2,58,658
జడ్చర్ల	1,11,354	1,11,863	5	2,23,222
దేవరకద్ర	1,18,372	1,20,705	-	2,39,077
మక్తల్	1,19,474	1,23,863	1	2,43,338
షాద్‌నగర్	1,19,114	1,19,211	13	2,38,338
మొత్తం	8,32,080	8,48,293	44	16,80,417

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు


కల్వకుర్తిలో పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

కల్వకుర్తి: ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కల్వకుర్తి, వెల్దండ మండలాలలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ముందు జాగ్రత్తగా 85 మందిని బైండోవర్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ బృందం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దాడులలో 10 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వెల్దండ మండలం, రాగాయిపల్లిలో బెల్టు షాపుపై దాడులు నిర్వహించి 8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వెల్దండ మండలం పలుగు తండాలో 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి సీఐ వెంకట్ రెడ్డి చెప్పారు.

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లి చెందిన పబ్బు అలివేలు నాటుసారా విక్రయిస్తుండగా పట్టుపడడంతో శుక్రవారం ఎస్‌ఐ రవి ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన రేచింతల చంద్రశేఖర్ శుక్రవారం మధ్యాహ్నం వెల్టూరు స్టేజీ వద్ద ఉన్న వైన్ షాపు నుంచి 12 బీరు బాటిళ్లు అక్రమంగా తీసుకెళ్తూ పట్టుబడినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.


వనపర్తి పట్టణంలో పట్టుబడిన మద్యం

తెలకపల్లి: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. బల్మూర్ మండలం కొండారెడ్డిపల్లికి చెందిన బోయినపల్లి రాజు శుక్రవారం సాయంత్రం తెలకపల్లి నుంచి 24 క్వార్టర్లు, 6 బీరు బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బాలానగర్: పెద్దరేవల్లిలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన గొర్రె శంకరమ్మ, వెంకటయ్య కిరాణా దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తనిఖీ చేయగా మద్యం పట్టుబడిందని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని సాయినగర్ కాలనీలోని జల్లు వెంకటేశ్వర్లు కిరాణం షాపులో టౌన్ ఎస్‌ఐ జయన్న ఆధ్వర్యంలో దాడులు చేయగా 34 లీటర్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. జల్లు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. వనపర్తి రూరల్ పరిధిలో వాహనాల తనిఖీలో రూ 80,900 నగదు పట్టుకున్నామని రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న తనిఖీలు

ఇప్పటి వరకు రూ.18లక్షల నగదు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసులు ఐదు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బండ్లగేరిలో విజయ్‌కుమార్ ఇంట్లో ఉన్న కిరాణదుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తుంటే ఏడున్నర లీటర్ల మద్యం సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 15.55లీటర్ల మద్యం సీజ్ చేయగా మూసాపేట, భూత్పూర్ పరిధిలో మద్యం సీజ్ చేశారు. దీంతో పాటు హన్వాడలో రూ.90వేలు, మహ్మదాబాద్‌లో రూ.85వేల నగదు సీజ్ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో ఏడు కేసులు నమోదు చేసి, రూ.18,04,500నగదు సీజ్ చేశారు. దీంతో పాటు 30లిక్కర్ కేసులు నమోదు చేసి 432.925లీటర్ల లిక్కర్ సీజ్ చేశారు.

బెల్లం, నవసాగ్రం పట్టివేత


పట్టుబడిన నిందితులు, బెల్లం బస్తాలతో ఎక్సైజ్ అధికారులు

జడ్చర్ల: సారా తయారీకి ఉపయోగించే బెల్లం, నవసాగ్రం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మిడ్జిల్ మండలం పెద్దగుండ్ల తండాలో దాడులు నిర్వహించగా ముడావత్ బుజ్జమ్మ వద్ద రెండు లీటర్ల సారా దొరకడంతో ఆమెను విచారించగా ఆమె కుమారుడు సుమన్ హైదరాబాద్ నుంచి బెల్లం సరఫరా చేస్తుండటంతో సారా తయారు చేస్తున్నట్లు తెలిపింది. బుజ్జమ్మ సమాచారం మేరకు హైదరాబాదులో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా వేసి ఉంచగా మలక్‌పేట ఫ్లైఓవర్ దగ్గర కారులో బెల్లం, నవసాగ్రం తరలిస్తుండగా పట్టుకున్నారు. కారులో 5.40 క్వింటాళ్ల బెల్లంతో పాటు క్వింటాల్ నవసాగ్రం స్వాధీన పర్చుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.36వేలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులు బుజ్జమ్మ, సుమన్‌ను అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వేసవిలో ఆకుకూరల సాగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వేసవిలో ఆకుకూరల సాగు రైతులకు కొంత వరకు లాభసాటిగా ఉంటుంది. ప్రజల ఆరోగ్య రక్షణ కల్పించడంతోపాటు రైతులకు లాభసాటిగా ఉంటుందని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు.

అనుకూల ఆకుకూరలు

వేసవిలో ముఖ్యంగా గోంగూర, తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా ఆకు కూరలు సాగు రైతులకు మేలు చేస్తాయి. వేసవిలో సాగుకు అనుకూలమైన విత్తనాలనే వాడాలి.

తోట కూర

తోట కూరలో ఆర్ఎన్ఏ–1 రకం ముఖ్యమైనది. ఆకులు, కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. విటమిన్ ఏ, సీలు అధికంగా ఉంటాయి. కాండం కూడా పీచు లేకుండా మృదువుగా రుచికరంగా ఉంటుంది. నెల రోజుల్లో ఎకరాకు 5–6 టన్నుల దిగుబడి వస్తోంది. మొదటి కోత ఎత్తిన 15–20 రోజుల్లో వస్తోంది. మొదటి కోత తర్వాత పక్క కొమ్మలు బాగా వస్తాయి. నీటి ఎద్దడిని తెల్ల మచ్చ తెగులు తట్టుకుంటుంది. ఎకరానికి 800 గ్రాముల విత్తనం అవసరం.

పాలకూర

పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం లేత ఆకులు కలిగి 15 నుంచి 20 రోజులకు కోతకు వస్తోంది. 6 నుంచి 7 కోతల్లో ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం. విత్తనాలను 20/10సెంటీమీటర్ల ఎడంగా, 3–4 సెంటీమీటర్ల లోతు మించకుండా విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొక్క సరిగ్గా రాదు. విత్తిన 8–10 రోజులకు గింజలు మొలకెత్తుతాయి.


ఆకు కూరల సాగు

గోంగూర

ఏఎస్‌జీఆర్‌యూ–1 రకం ప్రధానమైనది. ఎకరానికి 4–5 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరాకు 6 కిలోల విత్తనం అవసరం. ముందుగా 60 సెంటీమీటర్ల ఎడంగా బోదలు చేసుకుని, బోదలకు రెండు వైపుల విత్తనాన్ని 30 సెంటీమీటర్ల దూరంలో వరుసల్లో వేయాలి. మొలకెత్తిన 20 రోజులకు ఒత్తుగా ఉన్న మొక్కలను పీకి కట్టలు కట్టి విక్రయించాలి.

మెంతి కూర

పూసా ఎర్లీ బంచింగ్ రకం. ఇది త్వరగా కోతకు వచ్చే రకం. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండే విధంగా విత్తుకోవాలి.

కొత్తిమీర

సీఎస్–6 రకం పంట కాలం 80 నుంచి 85 రోజులు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. సాధన (సీఎస్–4) రకం పేను బంకను తట్టుకుంటుంది. ఎకరానికి 4 నుంచి 5 కిలోల విత్తనాన్ని 15 సెంటీమీటర్ల ఎడంలో విత్తుకోవాలి. విత్తిన 8–12 రోజుల్లో గింజలు మొలకెత్తుతాయి.

ఎండ నుంచి రక్షణ

ఆకుకూరలు అధిక ఎండలను తట్టుకోలేవు. కాబట్టి వేసవిలో సాగుకు నీడ ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవాలి. పొలంలో నీడనిచ్చేలా మొక్కజొన్న, ఆముదం పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటుకోవాలి. వేసవిలో మొక్క పెరుగుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి. వేసవిలో నీటి అవసరం ఎక్కువ కాబట్టి స్ప్రింక్లర్ల పద్ధతిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

టీడీపీ మూడో జాబితా విడుదల

11 ఎమ్మెల్యే, 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను వెల్లడించిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మరో 11 అసెంబ్లీ స్థానాలు, 13 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు ఆ పార్టీ 139 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. పొత్తులో భాగంగా 144 స్థానాల్లో పోటీచేయాల్సి వుండగా ఇంకా ఐదు స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. అలాగే, పొత్తులో 8 ఎంపీ స్థానాలు వదులుకోవడంతో 17 స్థానాలకుగానూ 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన నాలుగు స్థానాలకు ఖరారు చేయాల్సి వుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివాదంగా మారిన పెనమలూరు, మైలవరం సీట్లకు బోడె ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్ పేర్లను ఖరారుచేశారు. మైలవరం సీటు కోసం ఫిరాయింపు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావులు గట్టిగా పోటీపడ్డారు. ఈ స్థానాన్ని నిలుపుకునేందుకు దేవినేని ఉమా గట్టిగా పట్టుబట్టినా ఇటీవలే టీడీపీలో చేరిన కృష్ణప్రసాద్ ధనబలంతో దాన్ని చేజిక్కించుకున్నట్లు చెబుతున్నారు. మైలవరం టికెట్‌ను ఫిరాయింపు నేతకు ఇస్తున్న నేపథ్యంలో పెనమలూరు సీటుకు దేవినేని ఉమా పేరును పరిగణలోకి తీసుకుని అక్కడికి పంపుతున్నట్లు హడావుడి చేశారు. అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్‌ను పక్కనపెడుతున్నట్లు హంగామా చేసినా చివరికి ఆయనకే సీటు ఇచ్చారు. దీనివెనుకా భారీగా డబ్బు దండుకునే వ్యూహం అమలైనట్లు తెలుస్తోంది

టీడీపీ ఎంపీ అభ్యర్థులు వీరే..	
శ్రీకాకుళం	రామ్మోహన్ నాయుడు
విశాఖపట్నం	మాత్కుమిల్లి భరత్
అమలాపురం	గంటి హరీష్ మాధుర్
ఏలూరు	పుట్టా మహేష్ యాదవ్
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)
గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్
నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయలు
బాపట్ల	తెన్నేటి కృష్ణప్రసాద్
నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
చిత్తూరు	దగ్గుమళ్ల ప్రసాదరావు
కర్నూలు	బస్తిపాటి నాగరాజు
నంద్యాల	బైరెడ్డి శబరి
హిందూపురం	బీకే పార్థసారథి
ఎమ్మెల్యే అభ్యర్థులు..	
పలాస	గౌతు శిరీష
పాతపట్నం	మామిడి గోవిందరావు
శ్రీకాకుళం	గొండు శంకర్
ఎస్.కోట	కోళ్ల లలితకుమారి
కాకినాడ సిటీ	వనమాడి వెంకటేశ్వరరావు
అమలాపురం	అయితాబత్తుల ఆనందరావు
పెనమలూరు	బోడె ప్రసాద్
మైలవరం	వసంత కృష్ణప్రసాద్
నరసరావుపేట	డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు
చీరాల	ఎం. మాలకొండయ్య యాదవ్
సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు..

సాక్షి, హైదరాబాద్: బాపట్ల ఎంపీ సీటును ఆశ్చర్యకరంగా తెలంగాణకు చెందిన బీజేపీ నేత, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌కి ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో టీడీపీ శ్రేణులే అవాక్కయ్యాయి. ఆయన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి కావడంతోపాటు పుట్టి పెరిగింది అంతా తెలంగాణలోనే. అలాంటి వ్యక్తికి చంద్రబాబు ఏపీలో సీటు ఇచ్చారు. బాపట్ల స్థానానికి అభ్యర్థి దొరక్క చంద్రబాబు చాలారోజులపాటు అన్వేషణ కొనసాగించారు. ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఇవ్వాలని చూసినా ఆయనకు చిత్తూరు సీటు ఇచ్చి ఆఖరి నిమిషంలో కృష్ణప్రసాద్‌కు బాపట్ల సీటు ఇచ్చారు. నిజానికి.. వరంగల్ ఎంపీ సీటు కోసం బీజేపీ తరఫున పోటీచేసేందుకు కృష్ణప్రసాద్ ప్రయత్నించి విఫలమయ్యారు. ఈయనకు చంద్రబాబు అనూహ్యంగా ఏపీలో సీటు ఇవ్వడం గమనార్హం.

‘మత్తు’ చుట్టూ చుట్టాలే

▶ మొదటి పేజీ తరువాయి

తెరతీసింది. తద్వారా డ్రగ్స్ దందా వెనుక తాము ఉన్నామనే విష యాన్ని కప్పిపుచ్చవచ్చని చంద్రబాబు భావించారు. అయితే కూనం కోటయ్య చౌదరితో టీడీపీ నేతల వ్యాపార బంధం వెలుగు చూడటంతో బాబు కుట్ర బెడిసికొట్టింది. చంద్రబాబు వదిన, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబంతో కూనం కుటుంబానికి ఉన్న వ్యాపార బంధం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. రాయపాటి, దామచర్ల, లావు కుటుంబ సభ్యు లతో కూనం కోటయ్య చౌదరి కలసి ఉన్న ఫోటో లు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూనం వీరభద్ర చౌదరితో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజాకు ఉన్న బంధాన్ని రుజు వు చేసే వ్యాపార లావాదేవీల పత్రాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో టీడీపీ, బీజేపీ పొత్తు కుదు రుతుందనే సంకేతాలు అందిన వెంటనే బ్రెజిల్ నుంచి భారీగా డ్రగ్స్ దిగుమతికి తెర తీసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడం గమనార్హం.

కింగ్ పిన్ కోటయ్య చౌదరి..

డ్రగ్స్ దందాలో కీలక పాత్రధారులైన సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు అత్యంత సన్నిహితులని ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. ఆయన సన్నిహితులు, వ్యాపార భాగస్వాముల జాబితాను చూస్తే ఆ విషయం తేలిపోతోంది. దామచర్ల సత్యం (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి)లకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారంతా ఓ కోటరీగా పెద్ద ఎత్తున వ్యవహారాలు సాగించారన్నది వెల్లడైంది. వారు విదేశాల్లో అత్యంత సన్నిహితంగా తిరిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దామచర్ల సత్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబుతోనూ సాన్నిహిత్యం ఉంది. సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరితోపాటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత ఆలపాటి రాజాకు వ్యాపార బంధం ఉంది. వారిద్దరూ సంతకాలు చేసిన పలు పత్రాలు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విశాఖ కేంద్రంగా వ్యవహారాలు సాగిస్తున్న సంధ్యా ఆక్వా కంపెనీకి నందమూరి కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. బాలకృష్ణ చిన్నల్లుడు, లోకేశ్ తోడల్లుడు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.భరత్‌కు కూనం కోటయ్య చౌదరి అత్యంత సన్నిహితుడు. ఆయన కుటుంబం సహకారంతోనే విశాఖ కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. సంధ్యా ఆక్వా కంపెనీతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వ్యాపార బంధం ఉందన్నది ఇప్పటికే బయటపడింది. పురందేశ్వరి కుమారుడు చెంచురామ్, వియ్యంకుడు భాగస్వాములుగా కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరి ఆక్వా వ్యాపారాన్ని ప్రారంభించారు. దీంతో డ్రగ్స్ దందాలో తీగ లాగితే చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి కోటరీ అక్రమాల డొంకంతా కదులుతోంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ..

దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పాత్ర ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడిన సిండికేట్‌లో ఆ కంపెనీ కూడా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఆ కేసును కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు విశాఖ డ్రగ్స్ దందాను కూడా కలిపి మొత్తంగా మద్యం, డ్రగ్స్ మాఫియా గుట్టును ఛేదించే పనిలో నిమగ్నమైంది.

పొత్తుతోనే బరితెగింపు..

ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఎప్పుడో సిద్ధపడ్డారు. అందుకోసం కాళ్ల బేరానికి కూడా దిగజారతానని గతేడాదే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పొత్తును అవకాశంగా చేసుకుని భారీగా డ్రగ్స్ దందాకు పచ్చ మాఫియా బరితెగించింది. ఎన్నికల ముందు భారీగా డ్రగ్స్‌ను రాష్ట్రంలోకి తరలించేందుకు పథకం వేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే సంధ్యా ఆక్వా కంపెనీ ద్వారా బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల ఈస్ట్ దిగుమతి ముసుగులో భారీగా డ్రగ్స్‌ను చేరవేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రెండు నెలల్లో డ్రగ్స్ విశాఖ చేరుకునేలా అంతా సిద్ధమైంది. అటు దగ్గుబాటి ఇటు చంద్రబాబు కుటుంబాలు సహకారం ఉండటంతో తమ దందాకు అడ్డు ఉండదని భావించారు. డ్రగ్స్ మాఫియాపై అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటర్‌పోల్‌కు ఉప్పందడంతో ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయాన్ని అప్రమత్తం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారుల బృందం విశాఖ పోర్టులో నిర్వహించిన తనిఖీల్లో డ్రగ్స్ బాగోతం బట్టబయలైంది. పచ్చ కుట్ర బెడిసికొట్టింది.

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ తక్షణమే ప్రతి స్పందించింది. డ్రగ్స్ దందాతో నారా, నందమూరి, దగ్గుబాటి కుటుంబాలకు ఉన్న బంధాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నియమావళిని ఉల్లంఘిస్తూ చంద్రబాబు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆధారాలతో నివేదించింది. దీనిపై జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. డ్రగ్స్ దందాపై సత్వరం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీబీఐని కోరింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి పాత్రధారులతోపాటు సూత్రధారులను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేసింది.

కూనం కుటుంబం కథ...

విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన పాత్రధారులైన సంధ్యా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ అధినేతలు కూనం వీరభద్ర చౌదరి, కుమారుడు కూనం కోటయ్య చౌదరి స్వగ్రామం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి. ఆక్వా రంగంలో ఉత్థాన పతనాలను చూసిన వీరభద్ర చౌదరి డ్రగ్స్ వ్యాపారంలో కాలు మోపాడు. కాకినాడ ప్రధాన కేంద్రంగా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్ల ముసుగులో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అటు టీడీపీ ఇటు రాష్ట్ర బీజేపీ అగ్రనేతల అండదండలతో తన కార్యకలాపాలను విస్తరించాడు. కూనం కుటుంబానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సంధ్యా ఆక్వా ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్లతో పాటు ఆక్వా కల్చర్ చెరువులు కూడా ఉన్నాయి. వీరి వ్యాపార లావాదేవీలు కొండపి, ఒంగోలు, కందుకూరు, పర్చూరు నియోజకవర్గాల్లోనూ సాగుతున్నాయి. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోదరుడు దామచర్ల సత్యనారాయణ(సత్య)తో కూనం కుటుంబానికి వ్యాపార లావాదేవీలున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో దామచర్ల సత్యకు చెందిన పొగాకు గోడౌన్‌లో సంధ్యా ఆక్వా పేరుతో ప్రీ ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటైంది. కూనం కుటుంబానికి విజయవాడకు చెందిన సొమ్ముడిగా పేరున్న ఓ టీడీపీ నేతతోనూ సంబంధాలున్నట్లు సమాచారం. కోటయ్య చౌదరి, టీడీపీ నేత తనయుడు తనయుడు విదేశాల్లో మంచి సన్నిహితులని తెలిసింది.

చీరాలకు లింకు?

డ్రగ్స్ దందాకు చీరాలతో కూడా లింకులు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. సంధ్యా ఆక్వా పేరుతో వాడరేవులో గత రెండేళ్లుగా కంపెనీ నడుస్తోంది. దీన్ని పురందేశ్వరి అల్లుడు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. గత పది రోజులుగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం.

కాకినాడ తీరంలో కలకలం

డ్రగ్స్ తీగ లాగితే కాకినాడ జిల్లా కొత్తపల్లి తీరంలోని మూలపేటలో డొంక కదిలింది. మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 10 మంది సీబీఐ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో సోదాలు జరిపారు. సీబీఐ ఇన్‌స్పెక్టర్ బల్వీందర్ సింగ్ ఆధ్వర్యంలో సీబీఐ బృందం ఈ తనిఖీలు చేసింది. జిల్లాలోని శంఖవరం మండలం కత్తిపూడి సమీపాన ఉన్న సంధ్య ఆక్వా సీడ్ తయారీ కంపెనీ, కృష్ణా జిల్లా పామర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న సంధ్య ఆక్వా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్నారు. కత్తిపూడి సమీపంలోని సంధ్య ఆక్వా సీడ్ కంపెనీని ఇటీవలే ప్రారంభించారు. దీనిలో ఆక్వా సీడ్ తయారీకి అవసరమైన ముడి సరుకును బ్రెజిల్ నుంచి దిగుమతి చేయడంతో ఆ సరకు నౌక ద్వారా విశాఖకు కంటైనర్లలో చేరింది. వాటిలో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించిన సీబీఐ అధికారులు సంధ్య కంపెనీలన్నింటిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించి మందులు, ఇతర శాంపిల్స్ సేకరించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించిన సీబీఐ అధికారులు తిరిగి సోదాలు చేస్తామని తెలిపారు.

మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్ పరీక్ష

డ్రగ్స్ కేసులో సీబీఐ దూకుడు పెంచింది. శుక్రవారం మరికొన్ని శాంపిల్స్‌ను పరీక్షించగా ఫలితాలు పాజిటివ్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో న్యాయమూర్తి సమక్షంలో 25 వేల కేజీల సరుకుతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశారు. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి రవాణా నౌక ద్వారా విశాఖకు వచ్చిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 19, 20వ తేదీల్లో 49 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించగా డ్రగ్స్ ఉన్నట్లు నిర్ధారణైంది. దీంతో ఈ నెల 21వ తేదీన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం మరోసారి వీసీటీపీఎల్‌కు వెళ్లి మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించారు. వాటి ఫలితాలు కూడా పాజిటివ్‌గా వచ్చినట్లు సమాచారం. న్యాయమూర్తి సమక్షంలో రికార్డులతోపాటు శాంపిల్స్‌ను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తి సమక్షంలోనే బ్యాగులను సీజ్ చేశారు. మరికొన్ని సీబీఐ బృందాలు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలోమరిన్ని ఆధారాలతో సీబీఐ అధికారులు త్వరలోనే అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆలపాటి ఆర్థిక బంధం

విశాఖ డ్రగ్స్ కేసులో కీలక పాత్రధారి కూనం వీరభద్ర చౌదరితో మాజీ మంత్రి ఆలపాటి రాజాకు ఉన్న ఆర్థిక సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. ఆలపాటి రుణాలకు కూనం సెక్యూరిటీ ఇవ్వడంతోపాటు ఎస్ఆర్ఐ అకాడమీతో భాగం పంపిణీ చేసుకోవడం వంటి వ్యవహారాలు చోటు చేసుకున్నాయి. 2015 అక్టోబరు 31న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు అరండల్‌పేట విజయా బ్యాంకు బ్రాంచ్‌లో రూ.2 కోట్లు రుణం (దస్తావేజు నంబరు 11158/2015) తీసుకున్నారు. అదే ఏడాది

డిసెంబరు 9న మరో రూ.12 కోట్లు అదే బ్యాంకు నుంచి రుణాన్ని పొందారు. దీనికి ఆలపాటి రాజా భార్య ఆలపాటి మాధవితోపాటు కూనం వీరభద్రరావు, ఎస్ఆర్ఐ అకాడమీ ఆస్తులను (దస్తావేజు నంబరు 12521/2015) తనఖా పెట్టారు. 2021లో కూనం వీరభద్రరావుకు ఎన్నారై అకాడమికి సంబంధించి పార్టీషన్ దస్తావేజు కూడా నమోదైనట్లు తెలుస్తోంది. కూనం వీరభద్రరావు తమ ఆస్తులను తనఖా పెట్టి 2017లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రుణాన్ని ఇప్పించారు (దస్తావేజు నంబరు 4581/2017). ఇదే దస్తావేజును 2021లో (నంబరు 12205/2021) రద్దు చేసుకున్నారు. దీంతోపాటు మరికొన్ని ఆర్థిక లావాదేవీలు కూడా వీరిద్దరి మధ్య జరిగినట్లు తెలుస్తోంది.

గరుడ వాహనంపై రంగనాథస్వామి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి చతుస్థానార్చన, మోహినీ అలంకరణ, గరుడ వాహన సేవ తదితర కార్యక్రమాలను అర్చకులు జరిపించారు. దివ్యతేజ స్వరూపుడైన స్వామివారితో పాటు అమ్మవార్లను గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. రాత్రి 10 గంటలకు కల్యాణం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేషాచార్యులు, కన్నయ్యస్వామి, బద్రీనాథ్ ఆచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆముదాల ధర రూ.5,800

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,800, కనిష్ఠంగా రూ.5,769గా నమోదయ్యాయి. సీజన్ లేకపోవడం వల్ల కేవలం వంద బస్తాల ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 26295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

వరల్డ్ లిటరేచర్‌పై వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఫోర్త్ వరల్డ్ లిటరేచర్‌పై ఈ నెల 26న ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పీయూ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ మాలవీ ఒక ప్రకటనలో తెలిపారు. పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు హాజరుకావాలని సూచించారు.

కల్యాణం.. కమనీయం

- దక్షిణకాశీలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం





కల్యాణం జరిపిస్తున్న పండితులు.. కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర క్షేత్రంలో శుక్రవారం కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. దక్షిణకాశీగా వెలుగొందుతున్న ఆలయంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అశేష భక్తజన సందోహం మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. గ్రామంలో మహిళలు సిద్ధం చేసిన తలంబ్రాలను గ్రామస్తులు పల్లకిలో ఉంచి మేళతాళాల సవ్వడిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య పల్లకిని రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి తీసుకొచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూల పందిరిలో ఉంచారు. అనంతరం అదే ఆలయంలోని పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను సన్నాయి వాయిద్యాల మధ్య ఆలయంలోపలి నుంచి కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పురోహితులు ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలను కట్టించి, జీలకర్ర బెల్లంను పెట్టించారు. మేళతాళాల సవ్వడిలో పార్వతి మెడలో మంగళసూత్రాన్ని కట్టించి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. కల్యాణం సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. కల్యాణానికి తరలివచ్చిన అశేష భక్తజనంతో ఆలయ పరిసరాలు శోభాయమానంగా వెలుగొందాయి. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం పరిఢవిల్లింది. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, గ్రామస్తులు రవీందర్‌శర్మ, నాగిరెడ్డి, శ్రీహరి, బుచ్చన్నగౌడ్, రాములు, మనోహర్, దామోదర్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఆంజనేయులు, గుడిబండ శ్రీను, కొత్త చంద్రయ్య, దేవన్నయాదవ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన మహిళలు

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

కందూర్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎద్దుల బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో కర్నూల్ జిల్లా వంకూర్‌కి చెందిన దొడ్డికాడి తిరుమలేష్ ఎద్దులు(రూ.40వేలు) నిలిచాయి. రెండో స్థానం గద్వాల జిల్లాకు చెందిన వినిల్‌రాయుడు ఎద్దులు(రూ.30వేలు), మూడో స్థానంలో వనపర్తి జిల్లా పెద్దగడడ గోపాల కృష్ణ ఎద్దులు(రూ.20వేలు), నాలుగో స్థానంలో గద్వాల జిల్లా మానవపాడు టి.రవీందర్‌రెడ్డి ఎద్దులు(రూ.15వేలు), ఐదో స్థానంలో కర్నూల్‌కు చెందిన జాకీర్ బాష ఎద్దులు(రూ.10వేలు) నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవిత, ఈఓ రాజేశ్వరశర్మ, నిర్వాహకులు రవీందర్‌శర్మ, నాగిరెడ్డి, శ్రీహరి, దామోదర్‌రెడ్డి, బుచ్చన్నగౌడ్, రాములు, దేవన్నయాదవ్, మనోహర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కందూర్‌లో ఎద్దుల బండలాగుడు పోటీలు



జములమ్మ ఆలయ హుండీ లెక్కింపు

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిశీలకురాలు వెంకటేశ్వరి, ఈఓ పురందర్ కుమార్, చైర్మన్ గాయత్రి సతీష్‌కుమార్, భక్తుల సమక్షంలో 45 రోజుల హుండీ లెక్కించగా రూ.27,28,309 ఆదాయం సమకూరింది. వీటితో పాటు 28 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల మిశ్రమ వెండి వచ్చినట్లు అధికారులు వివరించారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం

- నేటి నుంచి మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాలు
- 25న తిరుకల్యాణ మహోత్సవం
- అమ్మవారి సన్నిధిలో ఏటా వందలాది వివాహాలు



వేంకటేశ్వరస్వామి వారి సమేత అలివేలుమంగతాయారు అమ్మవారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు దేవస్థానం నిత్య కల్యాణం.. పచ్చ తోరణంగా బాసిల్లుతోంది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతుంది ఈ పుణ్యక్షేత్రం. ప్రతి సంవత్సరం అమ్మవారి సన్నిధిలో కొన్ని వందల వివాహాలు కొనసాగుతాయి. మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ముగిసిన నెల రోజులకు దిగువ కొండ వద్ద కొలువుదీరిన అలివేలు మంగతాయారు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఉత్సవాలకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ బల్బులతో దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణం మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాల విశేషోత్సవాలు..

అలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా ఉత్సవాల మొదటిరోజైన శనివారం అంకురార్పణం, రాత్రి శేషవాహనసేవ కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుడుతారు. అలాగే 24న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 25న మధ్యాహ్నం 12 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, రాత్రికి గరుడవాహనసేవ, విమాన రథోత్సవం, 26న అశ్వవాహనసేవ, 27న పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృతస్నానం, రాత్రికి నాకబలి(నాగవెల్లి), ద్వాదశ రాధన, సప్తావరణాలు, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజులు తెలియజేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


ఆహ్లాదకర వాతావరణం..

దేవస్థానంలో వివిధ రకాల చెట్లతో పాటు శ్రీవారి వనంలో వివిధ రకాల మొక్కలను కూడా పెంచుతున్నారు. దీంతో దేవస్థానానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకర వాతావరణం లభిస్తుంది. మల్లె, మందారం, బొడ్డుమల్లె తదతర పూల మొక్కలతో పాటు మామిడి, ఉసిరి తదతర మొక్కలను కూడా పెంచుతున్నారు. వివిధ రకరకాల మొక్కలతో దేవస్థానం పరిసరాలు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి.



అలివేలు మంగతాయారు దేవస్థానం

అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిందే..



మాట్లాడుతున్న దేవాదాయశాఖ అధికారులు, చైర్మన్ రామశర్మ

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ భూములు, ఆలయ ఆవరణలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, దుకాణాలను కోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించాల్సిందేనని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం దేవాదాయశాఖ అధికారులు, పాలకవర్గం అక్రమంగా నిర్మించిన ఇళ్లు, దుకాణాలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, చారకొండ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, దుకాణాలను ఎండోమెంట్ అధికారులు, చైర్మన్ రామశర్మ, తహసీల్దార్, పోలీసు అధికారులు పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు, మండలంలో శాంతిభద్రతల దృష్ట్యా ఎలాంటి ఘటనలకు తావులేకుండా నిర్మాణాల తొలగింపును వాయిదా వేయాలని బాధితులు కోరారు. 20 ఏళ్లుగా ఇక్కడే ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నాం.. నెల గడువు ఇవ్వాలని విన్నవించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల అనంతరం ఖాళీ చేయాలని, లేదంటే తామే బలవంతంగా తొలగిస్తామని అధికారులు వివరించారు. ఆలయ ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత కల్పించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ తహసీల్దార్ గిరిధర్, ఇన్‌స్పెక్టర్ వీణాధరి, చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు, తహసీల్దార్ ప్రమీల, ఆర్ఐ నబీ, సిబ్బంది పాల్గొన్నారు.